## క్లుప్తంగా

### నేడు ఖమ్మానికి జీయర్ స్వామి రాక

**ఖమ్మంగాంధీచౌక్:** త్రిదండి అహోబిలం రామానుజ జీయర్ స్వామి నగరంలోని జెడ్పీ సెంటర్‌లో బుధవారం రాత్రి నిర్వహించే ప్రవచన కార్యక్రమానికి హాజరవుతున్నట్లు వికాస తరంగిణి జిల్లా అధ్యక్షుడు పోలా శ్రీనివాసరావు మంగళారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సేవాకాలం, తీర్థాగోష్టి వంటి కార్యక్రమాలు నిర్వహించబడతాయని పేర్కొన్నారు. కావున భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

### ఘనంగా మృత్తికా దినోత్సవం

**కామేపల్లి:** ప్రపంచ మృత్తికా దినోత్సవం సందర్భంగా రైతులకు భూసారం పెంపుదలకు మండల వ్యవసాయాధికారి భూక్యా తారాదేవి మంగళవారం సూచనలు చేశారు. కామేపల్లిలో రైతులతో ఆమె మాట్లాడుతూ.. సేంద్రియ ఎరువులు, పచ్చిరొట్ట వాడి భూసారాన్ని పెంపొందించుకోవాలని, జీవన ఎరువులు వాడి మొక్కలకు పోషకాలను అందించాలని, పంట అవశేషాలను కాల్చేయకుండా భూమిలోనే కలిపి వేయాలని సూచించారు. పప్పు దినుసుల పంటలతో పంట మార్పిడితో భూమి సారవంతంగా మారుతుందని చెప్పారు. భూసార పరీక్షల ఆధారంగా ఎరువుల వాడకం చేసుకోవాలని పేర్కొన్నారు. మల్చింగ్ విధానంతో నేలలోని తేమను పట్టి ఉంచే గుణం ఉండడంతో పాటు భూమి కోతకు గురి కాకుండా ఉంటుందని పేర్కొన్నారు. రైతులు వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలు పాటించి పంట దిగుబడి పెంపొందించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

### జీపీ పదవులకు రాజీనామా చేయాలి

**ఖమ్మంలీగల్:** పార్టీ పరంగా వచ్చిన గవర్నమెంట్ ప్లీడర్ (జీపీ), అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్, మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ వంటి తదితర టెన్యూర్ పదవులు అనుభవిస్తున్న న్యాయవాదులు వెంటనే రాజీనామా చేయాలని ఐఏఎల్ సభ్యుడు, సీనియర్ న్యాయవాది పారుపల్లి అమర్‌చంద్ డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ పార్టీ ఓడిపోయిన నేపథ్యంలో వారు ఆయా పదవుల్లో కొనసాగడానికి అనర్హులని పేర్కొన్నారు.

### రేవంత్‌రెడ్డి ఎన్నికపై హర్షం

**నేలకొండపల్లి:** సీఎల్‌పీ నేతగా రేవంత్‌రెడ్డిని అధిష్టానం ఎంపిక చేయడంపై కాంగ్రెస్ నాయకులు, నేలకొండపల్లి మత్స్య పారిశ్రామిక సహకార సంఘం చైర్మన్ మైశా శంకర్ హర్షం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణకు కొత్త ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి రావాలని ప్రజలు ఆకాంక్షించినట్టే కాంగ్రెస్ అధిష్టానం, ఎమ్మెల్యేలు అంతా ఏకగ్రీవంగా తీర్మానం చేయడం సంతోషం అన్నారు. అలాగే జిల్లాకు చెందిన తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, భట్టి విక్రమార్కలకు కూడా అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, తద్వారా జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చెందడానికి అవకాశం ఉందని చెప్పారు. ఈ విలేకర్ల సమావేశంలో పార్టీ నాయకులు కడియాల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

### నగరంలో సినిమాలు

| | |
|---|---|
| తిరుమల | యానిమల్ |
| వినోద | యానిమల్ |
| సాయిరాం | అథర్వ |
| ఆదిత్య | ఆదికేశవ |
| శ్రీనివాస | కాలింగ సహస్ర |
| సుందర్ | బ్రీత్ |

- ఖమ్మంగాంధీచౌక్

### ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

| కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో) | | ఆకుకూరల కట్టలు (రూ.ల్లో) | |
|---|---|---|---|
| టమాట | 34 | బచ్చలికూర | 32 |
| వంకాయ | 40 | | 10 |
| బెండకాయ | 40 | పాలకూర | 3 |
| పచ్చిమిర్చి | 40 | | 20 |
| కాకర | 50 | చుక్కకూర | 3 |
| బోడ కాకర | 100 | | 20 |
| బీర | 46 | తోటకూర | 3 |
| దొండ | 30 | | 10 |
| పొట్లకాయ | 30 | గోంగూర | 2 |
| చిక్కుడు | 56 | | 10 |
| గోరుచిక్కుడు | 40 | మెంతికూర | 2 |
| క్యాబేజీ | 20 | | 10 |
| క్యాలీఫ్లవర్ | 20 | కొత్తిమీర | 1 |
| ఆలుగడ్డ | 28 | | 30 |
| చామగడ్డ | 46 | పుదీన | 1 |
| క్యారెట్ | 50 | | 20 |
| క్యాప్సికం | 50 | -ఖమ్మం వ్యవసాయం | |

# చివరి క్షణాల్లో..



**చేతికందే పంట నేలపాలు**

- కొనుగోలు కేంద్రానికి తరలించిన ధాన్యం వర్షార్పణం
- నీటిపాలై కొట్టుకుపోయిన ధాన్యం రాశులు
- మిగతాది పొలాలు, కల్లాల్లోనే..
- రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న మిచాంగ్

**ఆరుగాలం కష్టపడి పండించిన పంటను కాపాడుకోవడానికి రైతన్నలు మిచాంగ్ తుపాన్ ముప్పుతో కలవరపడుతున్నారు. మద్దతు ధరకు ధాన్యం అమ్ముకుందామని ఆవపడుతున్న తరుణంలో ఆకాశంలో మబ్బులు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. పాలేరు నియోజకవర్గంలో వరి కోతలు ప్రారంభమై.. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం చేరుకుంటోంది. తుపాన్ కారణంగా ఆకాశంలో కారుమబ్బులు కమ్ముకోవటంతో అధికారులు వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలని రైతాంగం వేడుకుంటోంది. కొనుగోలు కేంద్రాల్లో సరిపడా టార్పాలిన్లు లేకపోవడంతో రైతులు వద్ద ఉన్న కవర్లతోనే ధాన్యం తడవకుండా కాపాడుకుంటున్నారు.**



నేలకొండపల్లి మార్కెట్‌లో కొట్టుకుపోతున్న ధాన్యం (ఇన్‌సెట్) బైరవునిపల్లిలో ధాన్యం రాశుల చుట్టూ చేరిన వర్షపు నీరు

**నేలకొండపల్లి:** గత రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షానికి చేతికందే పంటతో పాటు మరికొద్ది రోజుల్లో చేతికి రానున్న వరి పొలాలు నేలను తాకడంతో కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో కొనుగోలు కేంద్రం ప్రారంభించకపోవడంతో యార్డులోనే గత 10 రోజులుగా ధాన్యాన్ని రైతులు ఆరబెట్టారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి ధాన్యమంతా తడిసి వరద నీటికి కొట్టుకుపోయాయి. కొనుగోలు కేంద్రం ప్రారంభించి కొనుగోళ్ల మొదలుపెట్టినట్లయితే కళ్ల ముందే పంట నీటిపాలు కాకుండా ఉండేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని బైరవునిపల్లిలో రైతుల ధాన్యం రాశుల మధ్య నీరు చేరి తడిసి ముద్దయింది. పలు గ్రామాల్లో రహదారుల వెంట, కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యం వర్షార్పణం అవుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని, నష్టపోయిన రైతులను గుర్తించి పరిహారం ఇవ్వాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

### పొలంలోనే పడుకుని..

నేలకొండపల్లి మండలం మంగాపురంతండాలో వరి కోతలు ప్రారంభం కావాల్సి ఉండగా.. కురుస్తున్న వర్షాలకు పొలాలు మొత్తం నేలమట్టమయ్యాయి. ఈనేపథ్యాన గ్రామానికి చెందిన భూక్యా బక్క అనే కౌలు రైతు తనకున్న అర ఎకరంతో పాటు, మరో ఎకరన్నర పొలాన్ని కౌలుకు తీసుకుని వరి సాగు చేశాడు. కానీ, వర్షం కారణంతో రెండెకరాలు వరి నేలమట్టమైంది.



నేలవాలిన వరిపై పడుకుని విలపిస్తున్న బక్క

మంగళవారం పొలాన్ని చూసిన బక్క పొలంలోనే పడుకుని బోరున విలపించారు.

### రెండెకరాల్లో నీరు చేరింది..



సాగు చేసిన రెండెకరాల వరి పొలం వర్షానికి తడిసి నేల వాలింది. ఇక దాని వలన నాకు ఏమీ ఉపయోగం లేదు. వెంటనే అధికారులు స్పందించి ఆదుకోవాలి. లేనిపక్షంలో అప్పులపాలై కుటుంబం ఇబ్బంది పడుతుంది.

- భూక్యా బక్క, మంగాపురంతండా, బాధిత రైతు

### కొనుగోళ్లు ప్రారంభించాలి..



స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో వెంటనే కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి వెంటనే కొనుగోళ్లు చేపట్టాలి. వారం నుంచి ధాన్యం ఇక్కడే ఆరబెట్టాను. రోజు ఆకాశంలో మబ్బులు చూసి కంటి మీద కునుకు లేకుండా పోతుంది.

- లింగం ఉపేందర్, నేలకొండపల్లి రైతు

### పంట నష్టపరిహారం చెల్లించాలి..



వర్షాలతో దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం ఇవ్వాలి. అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి కల్లాల్లో ఆరబెట్టిన తడిసిన ధాన్యాన్ని పరిశీలించి వెంటనే కొనుగోళ్లు చేపట్టాలి. లేకుంటే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది.

- బాలిన కృష్ణంరాజు, బైరవునిపల్లి, రైతు

# 35 మందికి డిపాజిట్ ఢమాల్..



**నేలకొండపల్లి:** గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ దఫా శాసనసభా ఎన్నికలలో అధిక సంఖ్యలో స్వతంత్ర అభ్యర్థులు పోటీ చేశారు. కానీ వారంతా డిపాజిట్(ధరావతు)ను కోల్పోయారు. నామినేషన్ వేసిన నాటి నుంచి ముమ్మరంగా ప్రధాన పార్టీలతో పోటీ పడి మరీ ప్రచారం చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. నామినేషన్ దాఖలు చేసే సమయాన అభ్యర్థులకు ఎన్నికల సంఘం నిర్ణయించిన రుసుంను డిపాజిట్‌గా చెల్లించాలి. ఇందులో జనరల్, బీసీ అభ్యర్థులకు డిపాజిట్ రూ.10 వేలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.5వేలు చెల్లించాలి. ఎన్నికలలో పోలైన చెల్లిన ఓట్లలో ఆరో వంతుకు అధికంగా ఓట్లు సాధిస్తే నామినేషన్ సమయాన చెల్లించిన డిపాజిట్ అభ్యర్థికి తిరిగి అందజేస్తారు. అంతకు తక్కువ ఓట్లు వస్తే డిపాజిట్‌ను ప్రభుత్వమే జప్తు చేసుకుంటుంది. గెలుపొందిన అర్హులైన అభ్యర్థులకు ఎన్నికల ప్రక్రియ ముగిసిన తరువాత డిపాజిట్ చెల్లిస్తారు. ఇక్కడ డిపాజిట్ అంటే డబ్బులు విషయం కాదు.. అభ్యర్థి బలం.

**13వేల ఓట్లు వస్తేనే..**

పాలేరులో 2,36,451 ఓట్లు ఉండగా.. 2,17,008 ఓట్లు పోలయ్యాయి. వాటిలో కనీసం 13 వేల ఓట్లు వస్తేనే డిపాజిట్ దక్కించుకునే వారు. జాతీయ, రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందిన పార్టీలు ఉన్నా.. కానీ పాలేరు నియోజకవర్గంలో మొత్తం 37 మంది పోటీ చేయగా.. 35 మందిలో ఏ ఒక్కరూ దరిదాపుల్లో కూడా లేరు. డిపాజిట్ దక్కించుకున్న వారిలో పొంగులేటి శ్రీనివాసరెడ్డికి 1,27, 820 ఓట్లు సాధించగా.. కందాళ ఉపేందర్‌రెడ్డికి 71,170 ఓట్లు సాధించారు. మిగతా ఎవరికీ రాలేదు.

# పాలేరులో కొనసాగిన హస్తం హవా..

- ఖమ్మం రూరల్‌లోనే కాంగ్రెస్‌కు 26 వేల పైచిలుకు ఆధిక్యం
- మిగతా మూడు మండలాల్లోనూ కాంగ్రెస్‌దే పైచేయి



**ఖమ్మంరూరల్:** పాలేరు నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈఎన్నికల్లో నాలుగు మండలాల్లో కాంగ్రెస్ పార్టీ హవా కొనసాగింది. పాలేరు అంటేనే కాంగ్రెస్‌కు కంచుకోట అనే నానుడికి తగ్గట్టుగా ఈఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటర్లు అత్యధికంగా ఓట్లు వేసి నిజం చేశారనే చెప్పొచ్చు. నియోజకవర్గంలోని ఖమ్మంరూరల్, కూసుమంచి, తిరుమలాయపాలెం, నేలకొండపల్లి మండలాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తన సమీప ప్రత్యర్థి, బీఆర్‌ఎస్ అభ్యర్థి కందాళ ఉపేందర్‌రెడ్డిపై ఎన్నికల ఫలితాల్లో స్పష్టమైన మెజార్టీ కనబర్చారు. ప్రతీ రౌండ్‌లోనూ శ్రీనివాసరెడ్డిదే పైచేయి సాధించారు. నియోజకవర్గంలో మొత్తం 2,36,287 ఓటర్లుండగా అందులో 2,14,865 మంది ఓటు వేశారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా 1,987మంది ఓటు వేశారు. రూరల్ మండలంలో పొంగులేటికి 48,615 ఓట్లు రాగా బీఆర్‌ఎస్ అభ్యర్థి కందాళకు 22,386 ఓట్లు వచ్చాయి. అంటే ఒక్క రూరల్ మండలంలోనే పొంగులేటికి 26,229 ఓట్లు మెజారిటీ ఓట్లు వచ్చాయి. అదే విధంగా తిరుమలాయపాలెం మండలంలో కాంగ్రెస్‌కు 26,509 ఓట్లు రాగా, బీఆర్‌ఎస్‌కు 16,572ఓట్లు పోలై కాంగ్రెస్‌కు 9,937 ఓట్ల మెజారిటీ వచ్చింది. కూసుమంచి మండలంలో కాంగ్రెస్‌కు 25,820 ఓట్లు రాగా, బీఆర్‌ఎస్‌కు 16,246 ఓట్లు వచ్చాయి. ఈ మండలంలో కూడా కాంగ్రెస్‌కు 9, 574ఓట్లు ఆధిక్యం సాధించింది. ఇక నేలకొండపల్లి మండలంలో కాంగ్రెస్‌కు 25,657 ఓట్లు రాగా, బీఆర్‌ఎస్‌కు 16,246 ఓట్లు వచ్చాయి. ఇక్కడ కాంగ్రెస్‌కు 9,411 ఓట్లు మెజారిటీ లభించింది. పోస్టల్ బ్యాలెట్ ద్వారా కాంగ్రెస్‌కు 1,577 ఓట్లు రాగా, బీఆర్‌ఎస్‌కు 311 ఓట్లు వచ్చాయి. మొత్తంగా కాంగ్రెస్ అభ్యర్థి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి 56,728 ఓట్ల మెజారిటీ లభించింది.

# ముంచిన ముసురు..!

**కోత దశలో నష్టపోతున్న రైతులు**

- యంత్రాలు, కూలీల కొరతతో వరికోతల్లో జాప్యం
- మరో రెండు రోజులు ముసురుకుంటే పంటలన్నీ పాడైనట్టే..
- మిర్చి తోటలనైనా కాపాడుకునే ప్రయత్నంలో అన్నదాతలు



మిర్చి రైతులకు సూచనలు చేస్తున్న ఏఓ భాస్కరరావు

**రఘునాథపాలెం:** తుపాన్ ప్రభావంతో గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న ముసురు చేతికొచ్చిన పంటలను నిండాముంచాయని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓ వైపు కోతలకు వచ్చిన వరితీతల చివరి దశల్లో ఉన్న పత్తి పంట మొత్తం వర్షార్పణం అయ్యాయని రైతులు చెబుతున్నారు. అసలే ఈ ఏడాది పూర్తిస్థాయిలో సాగర్ నీరు విడుదల కాక పోవడం.. సాగర్ ఆయకట్టు పరిధిలో వరి సాగు తగ్గడం, మరో వైపు చెరువుల్లోకి కూడా నీరు పుష్కలంగా లేక రైతులు ఇతర పంటలను సాగు చేసుకున్నారు. అక్కడక్కడ బోర్లు, బావులు, చెరువులు పరిధిలో సాగు చేసిన వరి పంట కోత దశకు చేరింది. వరుసగా ఎన్నికలు రావడంతో కొంత జాప్యం కారణం కాగా.. వరికోత యంత్రాలు లేక, కూలీల కొరతతో కోతకాక ఆశగా చూస్తున్న రైతులకు అకాల తుపాన్ ముంచిందని వాపోతున్నారు. వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి కోత దశలో నష్టం బాధకరంగా మారిందని చెబుతున్నారు. మరో వైపు పత్తి పంట చివరి దశ తీతలు ఉన్న సమయంలో వర్షంతో పత్తి నేల వాలిందని, దీంతో ఆరుగాలం కష్టం నేలపాలు అవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**4 వేల ఎకరాల్లో వరి..**
**16 వేల ఎకరాల్లో పత్తి..**

మండలంలో 4 వేల ఎకరాలకుపైగా వరి, 16 వేల ఎకరాలపైగా పత్తి పంటలను సాగు చేసినట్లు వ్యవసాయ అధికారుల లెక్కలు చెబుతున్నాయి. ఇలాంటి తరుణంలో మిరప తోటలకు నష్టం జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వ్యవసాయ శాఖ ఏఓ భాస్కర్ రావు ఇతర అధికారులు, రైతులకు సూచనలు చేస్తున్నారు. ఇలానే మరో రెండు రోజులు ముసురు కొనసాగితే పంట మొత్తం నాశనం అవుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# వర్షాలపై అప్రమత్తత అవసరం



రైతులకు సూచనలు చేస్తున్న ఏడీఏ విజయచంద్ర

**కూసుమంచి/ఖమ్మంరూరల్:** మిచాంగ్ తుపాన్ పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని కూసుమంచి ఏడీఏ విజయచంద్ర రైతులుకు సూచించారు. మంగళవారం కూసుమంచి, ఖమ్మంరూరల్ మండలాల్లోని పలు గ్రామాల్లో పర్యటించి రైతులను కలిసి పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తుపాన్ కారణంగా అధిక వర్షాలు కురుస్తున్నందున రైతులు వ్యవసాయ పనులను వాయిదా వేసుకోవాలన్నారు. కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని టార్పాలిన్ పట్టాలు కప్పి తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. పిడుగులు పడే అవకాశం ఉన్నందున చేలల్లో రైతులు చెట్ల కింద ఉండరాదని, అలాగే విద్యుత్ స్తంభాలను తాకరాదని సూచించారు. వర్షాల వలన మిరప తోటల్లో నీరు నిలువకుండా చూసుకోవాలని, వర్షాలు తగ్గాక అంతర్‌కృషి చేయటం వలన మొక్కలు తేమ తగ్గి సాధారణ స్థితికి వస్తాయని పేర్కొన్నారు. రైతులు డామిన్ యాప్‌ను తమ ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకుని ఎప్పుడు పిడుగులు పడతాయో తెలుసుకుంటూ అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. కాగా, కూసుమంచి ఏఓ వాణి కూడా కిష్టాపురం, చింతల్‌తండాల్లో పంటలను పరిశీలించి రైతులకు తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఈఓలు రవీందర్, సాయిరాం, ప్రియాంక, వంశీ, కిరణ్మయి పాల్గొన్నారు.

### వరి కోతలు వాయిదా వేసుకోవాలి..



ఆరెగూడెంలో సూచనలు ఇస్తున్న ఏఓ

**నేలకొండపల్లి:** తుపాన్ ప్రభావంతో రైతులు అప్రమత్తంగా ఉండి తగు జాగ్రత్తలు పాటించాలని నేలకొండపల్లి వ్యవసాయాధికారి దేశబోయిన అరుణకుమారి సూచించారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో ఆమె పర్యటించి రైతులకు పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కోతలు పూర్తయిన చోట ధాన్యపు రాశులు తడవకుండా టార్పాలిన్ పట్టాలతో లేదా యూరియా బస్తాలతో కప్పి భద్రపరుచుకోవాలని, పురుగు మందుల పిచికారీ, రసాయన ఎరువులు వేయడం చేయొద్దని చెప్పారు. వాతావరణం పరిస్థితులను గమనిస్తూ వరి కోతలు చేపట్టాలని, వీలైనంత వరకూ వరి కోతలను తాత్కాలికంగా వాయిదా వేసుకోవాలని సూచించారు. ఏఈఓలు, పలువురు రైతులు పాల్గొన్నారు.


### పొలాల్లో నిల్వ నీటిని తొలగించాలి..



పొలాలను పరిశీలిస్తున్న ఏఓ తారాదేవి

**కామేపల్లి:** మండలంలోని పలు గ్రామాల్లో వ్యవసాయాధికారి తారాదేవి క్షేత్రస్థాయిలో పర్యటించి రైతుల వద్దకు వెళ్లి సలహాలు, సూచనలు చేశారు. రైతులు ధాన్యాన్ని టార్పాలిన్‌తో కప్పి భద్రపర్చుకోవాలని, పంట పొలాలలో నిల్వ నీటిని తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ ప్రతిభ, రైతులు పాల్గొన్నారు.

### ప్రజలను అప్రమత్తం చేయాలి..



మాట్లాడుతున్న హనుమంతరావు

**నేలకొండపల్లి:** తుపాన్ పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నూక హనుమంతరావు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షాలు వస్తున్నందున్న ప్రజలను ఇంట్లో నుంచి ఎవరూ బయటకు రాకుండా జాగ్రత్తలు తీసుకునేలా చర్యలు తీసుకునేలా చూడాలని కోరారు. టార్పాలిన్లతో పంటను కాపాడుకోవడానికి వెంటనే పట్టాలు అందించాలని కోరారు.

### సీతారాం ఏచూరిని కలిసిన సంఘం నేతలు

**నేలకొండపల్లి:** సీపీఎం ఆల్ ఇండియా ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరిని మంగళవారం ఢిల్లీలో మండలానికి చెందిన వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు కే.వీ.రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు పెద్దపాక మల్లేశ్వరరావులు కలిశారు. ఢిల్లీలో బుధవారం సంఘం ఆధ్వర్యంలో జరగనున్న ధర్నాకు వెళ్లిన మండల నాయకులు పార్టీ కార్యాలయంలో ఏచూరిని కలిశారు. ఈ సందర్భంగా వారు వ్యవసాయ కార్మికుల కోసం సంఘం చేపడుతున్న పలు అంశాలను వివరించారు. అనంతరం సంఘం బలోపేతం, భవిష్యత్‌లో చేపట్టాల్సిన వివిధ కార్యక్రమాలపై ఏచూరి సూచనలు చేశాక ఇటీవల జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల గురించి ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో పలువురు సంఘం నాయకులు పాల్గొన్నారు.

### సర్కిల్‌లో విస్తృత తనిఖీ

**నేలకొండపల్లి:** స్థానిక ఎక్సైజ్ సర్కిల్‌లో మంగళవారం విస్తృతంగా తనిఖీ చేపట్టారు. ఇటీవల పలు చోట్ల మద్యంపై ఫిర్యాదులు రావడంతో స్థానిక ఎక్సైజ్ సీఐ కుమ్మరి పోశెట్టి ఆధ్వర్యాన మండలంలోని పైనంపల్లి, నేలకొండపల్లి, సింగారెడ్డిపాలెం తదితర గ్రామాల్లోని పలు ఇళ్లను తనిఖీ చేశారు. గతంలో బెల్ట్‌షాపు విక్రయాలు చేపట్టిన వారికి హెచ్చరికలు జారీ చేశారు. అక్రమంగా మద్యం విక్రయిస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. సర్కిల్‌లో ఎక్కడైనా మద్యం విక్రయాలు జరిపితే తమకు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని సీఐ అన్నారు.

### 'ప్రియదర్శిని'లో టాస్క్ ఆధ్వర్యాన వర్క్‌షాప్



మాట్లాడుతున్న ఆంటోనీడిసొజ

**ఖమ్మంరూరల్:** మండలంలోని పెదతండాలో గల ప్రియదర్శినిలో ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థినులకు సాఫ్ట్ స్కిల్ ప్రోగ్రామ్‌పై మంగళవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా టాస్క్ ప్రతినిధి బత్తుల ఆంటోనీడిసొజ మాట్లాడుతూ.. కమ్యూనికేషన్‌లో అడ్డంకులను అధిగమించేందుకు సాఫ్ట్ స్కిల్స్‌పై ప్రతీ విద్యార్థి అవగాహన కలిగి ఉండాలని, తద్వారానే భవిష్యత్‌లో మంచి ఉద్యోగావకాశాలు ఉంటాయని తెలిపారు. సాఫ్ట్ స్కిల్స్ అనేది అవసరమైన వ్యక్తిగత లక్షణాలు, అలవాట్లు, సామాజిక నైపుణ్యాలు, ఇతరులతో ప్రభావవంతంగా సంభాషించడానికి, కొత్త పరిస్థితులకు అనుగుణంగా ఉండటానికి వీలు కల్పిస్తాయన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ బి.గోపాల్ మాట్లాడుతూ.. నైపుణ్యాలు అకడమిక్ విజయానికి, సానుకూల సంబంధాలను నిర్మించిడానికి, వైరుధ్యాలను పరిష్కరించడానికి చాలా ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కె. నవీన్, వివిధ విభాగాధిపతులు తదితరులు పాల్గొన్నారు.

# ఎడతెరిపిలేని వాన..

**మిచాంగ్ తుపాన్ ఎఫెక్ట్‌తో గత రెండు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో పత్తి, వరి, మిర్చి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. మంగళవారం కురిసిన వర్షానికి చేతికందిన పత్తి పంట పూర్తిగా తడిసిపోవడంతో పాటు కోతకు వచ్చిన, కోసిన వరి పంటలు తడిసి ముద్దయ్యాయి. కళ్లాల్లో ఆరబెట్టిన మిర్చి పంట పూర్తిగా తడిసిపోగా.. ఈదురు గాలులతో మిర్చి పంటలు నేల వాలుతున్నాయి. వర్షాలతో నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని కోరుతున్నారు.**

- సాక్షినెట్‌వర్క్



నేలకొండపల్లిలో తడిసిన ధాన్యం రాశులు



తిరుమలాయపాలెం: బీసురాజుపల్లితండాలో తడిసిన వరి పనలు



తిరుమలాయపాలెం: కొక్కిరేణిలో తడిసిన పత్తి పంట